చదువుల కోవెలలో అమానుష ఘటన



వర్సిటీ ముందు ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

అన్నా వర్సిటీలో విద్యార్థినిపై ఇద్దరి అత్యాచారం

బాధితురాలి ప్రియుడిపై దాడి ● విద్యార్థి సంఘాల ఆందోళన

చెన్నై, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన అన్నా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఈ నెల 21వ తేదీ రాత్రి జరిగిన ఈ దారుణం బాధితురాలి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. ఆమె తన ప్రియుడితో కలిసి వున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ప్రియుడిపై దాడి చేసి అతడిని అక్కడి నుంచి బలవంతంగా పంపించి, ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. రాష్ట్ర రాజధాని నడిబొడ్డును ఉన్న అన్నా విశ్వవిద్యాలయం ప్రాంగణంలోనే సామూహిక అత్యాచారం జరగడం ప్రతి ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనను అన్ని రాజకీయ పార్టీల నేతలు ముక్తకంఠంతో ఖండించడంతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ కేసు వివరాలను పరిశీలిస్తే... కన్నియాకుమారి జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని అన్నావర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతోంది. ఇదే క్యాంపస్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న తన సీనియర్ విద్యార్థితో ప్రేమలో పడింది. వీరిద్దరూ క్యాంపస్‌లో వేర్వేరు వసతి గృహాల్లో ఉంటున్నారు. అయితే, వీరిద్దరూ రాత్రి పూట వర్సిటీ క్యాంపస్‌లో పెద్దగా జనసంచారం లేని చోట రాత్రి బాగా పొద్దు పోయే వరకు కూర్చొని మాట్లాడుకునే వారు. అదే విధంగా సంఘటన జరిగిన రోజు కూడా వీరిద్దరూ కలిసివుండగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ప్రియుడిని చితకబాదారు. అక్కడి నుంచి బలవంతంగా పంపించేశారు. ఆ తర్వాత ఆ విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. తనకు జరిగిన దారుణంపై బాధితురాలు కొట్టూర్పురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులపై కేసు నమోదు చేశారు. యూనివర్సిటీకి చెందిన విద్యార్థులే ఈ దారుణానికి పాల్పడి వుంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకుని నిందితుల గుర్తింపు కోసం పరేడ్ కూడా నిర్వహించారు. మరోవైపు బాలికపై అత్యాచారం చేయడంతో పాటు ఆమెను నగ్నంగా వీడియోలు తీసినట్లు సమాచారం. ఈ ఘటన తర్వాత బుధవారం అన్నా విశ్వవిద్యాలయంలో భద్రత కట్టుదిట్టం చేశారు. కేవలం గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే క్యాంపస్‌లోకి అనుమతించారు.

● రాజకీయ నేతల ఖండన

దేశంలోనే గుర్తింపు పొందిన అన్నా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం జరిగిన ఘటన ప్రతి ఒక్కరినీ ఉలిక్కిపడేలా చేసింది. ఈ ఘటనను మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, సీపీఎం నేత కే.బాలకృష్ణన్, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ముక్తకంఠంతో ఖండించారు. రాజధాని నడిబొడ్డున విద్యార్థినిపై లైంగికదాడి జరగడం రాష్ట్రానికే సిగ్గుచేటని, ఢిల్లీలో నిర్భయ ఘటన జరిగి 12 యేళ్ళు గడిచినప్పటికీ అదే తరహా ఘటన చెన్నైలో జరగడం శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించిపోయాయనే విషయాన్ని చెబుతోందని నేతలు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పరిరక్షించడంలో పూర్తిగా విఫలమైన డీఎంకే ప్రభుత్వాన్ని వారంతా ముక్తకంఠంతో ఖండిరచారు. ఈ లైంగిక దాడికి పాల్పడిన వారిని తక్షణం గుర్తించి అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

నిందితుడి అరెస్టు

విద్యార్థినిపై జరిగిన లైంగికదాడి కేసులో పోలీసులు ఒక నిందితుడిని అరెస్టు చేశారు. అతడు కోట్టూరుకు చెందిన జ్ఞానశేఖరన్ (37)గా గుర్తించారు. ఆ వ్యక్తిని విచారించగా నేరాన్ని అంగీకరించినట్టు తెలుస్తోంది. అలాగే, పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. అంతే కాకుండా యూనివర్శిటీ ప్రాంగణంలో విద్యార్థినీ విద్యార్థులకు భద్రత కల్పించేందుకు చెన్నై నగర పోలీసు ఉన్నతాధికారులు, యూనివర్సిటీ భద్రతా అధికారులు కలిసి (జాయింట్ సెక్యూరిటీ రివ్యూ) చర్చించి యూనివర్శిటీ క్యాంపస్‌లో భద్రత కట్టుదిట్టం చేశారు. ఇదిలా వుండగా యువతిపై అత్యాచారాన్ని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ నేతలు బుధవారం యూనివర్సిటీ గేటు ముందు ఆందోళన చేపట్టారు.

కొత్త సంవత్సర వేడుకలు.. లక్షమంది పోలీసులతో భద్రత

● మెరీనాలో సముద్ర స్నానాలపై నిషేధం
● 25 ప్రత్యేక బృందాలతో పెట్రోలింగ్



అడయార్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, మెరీనా తీరంలో సముద్ర స్నానాలను నిషేధించారు. మెరీనా తీరంలో 25 ప్రత్యేక బృందాలతో పెట్రోలింగ్ నిర్వహించనున్నారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2025 సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ నగర వాసులు సంబరాలు జరుపుకుంటారు. ఈ వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. ఈ నెల 31వ తేదీ రాత్రి నగరంలోని నక్షత్ర హోటళ్ళు, రిసార్టులు, ఫామ్ హౌస్‌ల్లో న్యూ ఇయర్ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాంటి చోట్ల గట్టి భద్రత కల్పించనున్నారు. ఒక్క చెన్నై నగరంలోనే 20 వేల మంది పోలీసులు భద్రతా చర్యల్లో నిమగ్నంకానున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా ప్రమాదాలను నివారించేందుకు వాహన రాకపోకలను నియంత్రించనున్నారు. చెన్నై నగరంలో 1500 మంది హోం గార్డుల సహా 18వేల మంది పోలీసులను భద్రత కోసం వినియోగిస్తున్నారు. ఈ నెల 31వ తేదీ రాత్రి 9 గంటల నుంచే రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో పోలీస్ భద్రత ఏర్పాటు చేయనున్నారు. వాహనాల వేగ నియంత్రణ కోసం నగర వ్యాప్తంగా 40కుపైగా ప్రాంతాల్లో తాత్కాలిక చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. పాత మహాబలిపురం రోడ్డు, ఈస్ట్ కోస్ట్ రోడ్డు (ఈసీఆర్) వంటి రహదారుల్లో బైక్, ఆటో రేస్‌లు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా సారించారు. మెరీనా తీరంలోని సర్వీస్ రోడ్డును ఈ నెల 31వ తేదీ రాత్రి 7 గంటల నుంచి జనవరి ఒకటో తేదీ ఉదయం 6 గంటల వరకు మూసి వేయనున్నారు. ఈ సర్వీస్ రోడ్డులో వెళ్ళే వాహనాలను లైట్ హౌస్ జంక్షన్ మీదుగా వెళ్ళాల్సి ఉంటుంది. చెన్నై నగరంలోని 30కి పైగా వంతెనలను 31వ తేదీ రాత్రి 10 గంటల నుంచి జనవరి 1వ తేదీ ఉదయం 6 గంటల వరకు మూసివేయనున్నారు. ఈ కొత్త సంవత్సర వేడుకలను నగర పోలీసులు ఆనందంతో జరుపుకోవాలని నగర పోలీసులు కోరారు.





బీసెంట్ నగర్ వేలాంకన్ని చర్చిలో భక్తులు - మైలాపూర్ శాంథోమ్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న బిషప్

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు

ప్యారీస్, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, కరుణకు ప్రతిరూపమైన యేసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ సంబరాలు రాష్ట్రంలో అంబరాన్నంటాయి. మంగళవారం అర్థరాత్రి నుంచి బుధవారం వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నాగపట్నం జిల్లాలో ప్రసిద్ధి చెందిన వేలాంకన్ని చర్చిలో తమిళం, ఆంగ్లం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ, కొంకిణి తదితర భాషల్లో ప్రార్థనలు చేశారు. అదే విధంగా తూత్తుకుడి సెయింట్ పనిమయ మాత చర్చిలో, కన్నియాకుమారి చర్చిలో క్రిస్మస్ పండుగ జరుపుకున్నారు. నాగర్‌కోయిల్ ఏసీసీ చర్చ్, సెయింట్ సవేరియా చర్చ్, క్రీస్తురాజా చర్చి సహా సీఎస్ఐ చర్చిల్లో క్రీస్తు జననంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే తంజావూర్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన పూండి సెయింట్ మేరీ మాత ఆలయం, సెయింట్ పీటర్స్ చర్చ్, తిరుచ్చిలోని సెయింట్ జేవియర్ చర్చ్, కోవై సెయింట్ మైకేల్ చర్చ్, తిరునెల్వేలి జిల్లా పాళయంకోటలోని చర్చి, బీసెంట్ నగర్ వేలాంకన్ని చర్చ్, మైలాపూర్‌లోని శాంథోం చర్చ్, సైదాపేట లిటిల్ మౌంట్ చర్చి, జెమిని సర్కిల్‌లోని కెథడ్రల్ చర్చి, ప్యారీస్‌లోని సెయింట్ ఆంథోని చర్చిల్లో క్రిస్మస్ సంబరాలు జరిగాయి.

జనవరి నుంచి టాస్మాక్‌లో 'క్యూ ఆర్' కోడ్

● అధికారుల సన్నాహాలు

చెన్నై, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జనవరి నుంచి క్యూ ఆర్ కోడ్ విధానంలో మద్యం విక్రయాలు జరుగనున్నాయి. టా స్మాక్ సంస్థ దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తున్న విషయం తెలిసిందే. మద్యం విక్రయాల్లో దుకాణాల సిబ్బంది చేతివాటం ప్రదర్శించి బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 వరకు అధికంగా వసూలుచేస్తున్నట్లు ఫిర్యాదులందాయి. అదే సమయంలో నకిలీ మద్యం విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నట్లు సమాచారం. వీటిని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



ఇందులో భాగంగా టాస్మాక్ దుకాణాల్లో డిజిటల్ విధానంలో విక్రయాలు చేపట్టాలని నిర్ణయించింది. తొలివిడతగా రాణిపేట, రామనాథపురం, కాంచీపురం, శివగంగ, కరూర్, తిరుప్పూర్, తిరుచ్చి, పుదుకోట జిల్లాల్లో క్యూ ఆర్ కోడ్ ద్వారా మద్యం విక్రయించి రసీదులు అందజేసే విధానం ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఈ విధానాన్ని వచ్చే ఏడాది జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాల్లో అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయమై టాస్మాక్ ఉన్నతాధికారి మాట్లాడుతూ... ప్రస్తుతం దుకాణ సిబ్బంది, వినియోగదారుల, గోదాముల సిబ్బందికి క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పించామన్నారు. ఈ విధానంతో గోదాముల నుంచి దుకాణాలకు తరలించే మద్యం బాటిళ్ల వివరాలు తెలుసుకొనే అవకాశముందని తెలిపారు. అదే సమయంలో ఈ విధానంతో దుకాణా సిబ్బందిపై పనిభారం కూడా తగ్గుతుందన్నారు. ఈ విధానం అమలైన తర్వాత దుకాణానికి అవసరమైన మేర సిబ్బందిని ఉంచి, అదనపు ఉద్యోగులను ఇతర విభాగాలకు తరలిస్తామని వివరించారు.

ఐదు రోజులు మోస్తరు వర్షాలు

పెరంబూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, లక్షద్వీప్ ప్రాంతంలో నెలకొన్న ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజులు స్వల్ప వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది. గత అక్టోబరులో రాష్ట్రంలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. అనంతరం నవంబరులో 'పెంగల్' తుఫాను, అనంతరం అల్పపీడనం ప్రభావంతో విల్లుపురం, తిరువణ్ణామలై సహా పలు జిల్లాలు తీవ్ర నష్టం చవిచూశాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 30వ తేది వరకు మోస్తరు వర్షాలు కురవనున్నాయి. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

సెల్వమగళ్ పథకానికి శ్రీకారం

● ప్రారంభించిన అన్నామలై
● ఘనంగా వాజ్‌పేయి శతజయంతి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



పథకం ప్రారంభోత్సవంలో నేతలు, లబ్ధిదారులు

చెన్నై, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి వేడుకలు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా కోలాహలంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు పలు కార్యక్రమాలు చేపట్టాయి. రాష్ట్ర బీజేపీ తరఫున 'సెల్వమగళ్' పథకంలో లక్ష మంది ఆడపిల్లలను చేర్చే ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. అడయార్ గాంధీ నగర్‌లో ఈ కార్యక్రమాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ అధ్యక్షత వహించగా, డా.హెన్నే వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో లక్ష మంది ఆడపిల్లలను ఈ పథకంలో చేర్చే పనులను బీజేపీ నేతలు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నేతలు తమిళిసై సౌందర్‌రాజన్, హెచ్.రాజా, కరు నాగరాజన్, సతీష్‌కుమార్, మడిపాక్కం శ్రీధర్ సహా పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి



పెరంబూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా ఎట్టాయపురం సమీపంలో గుర్తు తెలియని వాహనం కారును ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తారాపురం అయ్యప్పన్ గార్డెన్‌కు చెందిన సెల్వరాజ్ (38), అతని స్నేహితులు అయ్యంపాళయానికి చెందిన విజయకుమార్ (38), అలంగియం ప్రాంతానికి చెందిన విఘ్నేష్ (31), పళని సమీపం ఆండినాయకర్‌వలసుకు చెందిన మహేష్‌కుమార్ (35), రాజ్‌కుమార్ (35) మురుగన్ మాల వేశారు. రెండు రోజుల క్రితం వీరు ఆలయాల సందర్శనకు కారులో బయల్దేరారు. మంగళవారం ఉదయం స్వామిమలైకు వెళ్లిన వారు దర్శనం అనంతరం తంజావూరు బృహదీశ్వరాలయానికి వెళ్లారు. అక్కడి నుంచి తిరుచెందూర్‌కు బయల్దేరారు. కారును సెల్వరాజ్ నడుపుతుండగా, బుధవారం వేకువజామున మదురై-తూత్తుకుడి జాతీయ రహదారిపై మేలకరై ప్రాంతంలో సెల్వరాజ్‌కు నిద్ర ముంచుకొచ్చింది. దీంతో కారును రోడ్డు పక్కన నిలిపి, ముఖం కడుక్కుంటుండగా, వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వాహనం ఢీకొన్న వేగానికి కారు రోడ్డు పక్కనున్న గుంతలో పడింది. ఈ ఘటనలో సెల్వరాజ్, విజయకుమార్, విఘ్నేష్ ఘటనా స్థలంలోనే మృతిచెందగా, మహేష్‌కుమార్, రాజ్‌కుమార్‌లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎట్టాయపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెనుక నుంచి ఢీకొన్న వాహనం ఆగకుండా వెళ్లినట్లు తేలడంతో ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

సీఎం దిగ్భ్రాంతి...

ఎట్టయపురంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ముగ్గురు మృతిచెందిన ఘటనపై ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ఈ ఘటనపై మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబాలకు తలా రూ.2 లక్షలు, ప్రమాదంలో గాయపడిన ఇద్దరికి తలా రూ.50 వేలు అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌పేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా తిరువేర్కాడు పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. కోలడి రోడ్డు, అన్బు నగర్, మహాలక్ష్మి నగర్, దేవికరుమారియమ్మన్ నగర్, అన్నై అబిరామి నగర్, తేరోడుం వీధి, చిన్న కోలడి లక్ష్మీనగర్, చెల్లియమ్మన్ నగర్, దేవి నగర్ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక షోలింగనల్లూర్, పల్లావరం పరిధిలో గురువారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. పల్లావరంలోని 110 కె.వి. ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు జరిగే శిబిరంలో, రెండు ప్రాంతాల వినియోగదారులు విద్యుత్ సరఫరా, బిల్లులు సహా ఇతర సమస్యలకు పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు రైతు గ్రీవెన్స్

పెరంబూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 27వ తేది శుక్రవారం ఉదయం 10 గంటలకు రైతుల గ్రీవెన్స్ జరుగనుంది. వ్యవసాయ, ఉద్యానవన విక్రయాలు, మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్య, సహకార, విద్యుత్ బోర్డు, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. రైతులు తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

29న 'శ్రీపాద కథలు.. గోదావరి గలగలలు'

చెన్నై, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక 156వ ప్రసంగం ఈ నెల 29వ తేదీ జరుగనుంది. ఇందులో భాగంగా విజయవాడకు చెందిన విశ్రాంత ఆంగ్లోపన్యాసకులు బొడ్డపాటి చంద్రశేఖర్ 'శ్రీపాద కథలు.. గోదావరి గలగలలు' అనే అంశంపై ఉపన్యసించనున్నారు. టి.నగర్ విజయరాఘవరోడ్డులోని ఆంధ్రా క్లబ్‌లో జరుగనున్న ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

నేటినుంచి రాయితీ ధరకు ఐస్‌క్రీమ్

పెరంబూర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆవిన్ ఐస్‌క్రీమ్ ధరల్లో రాయితీ ప్రకటించింది. ఆవిన్ 75 రకాల ఐస్‌క్రీమ్ తయారు చేస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా నెలకు రూ.1.5 కోట్లమేర విక్రయాలు జరుగుతున్నాయి. విక్రయాలు పెంచేలా ఆవిన్ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా, రెండు ఐస్‌క్రీమ్ కొనుగోలుపై రూ.10 తగ్గించనుంది. ఈ రాయితీ బుధవారం నుంచి జనవరి 31వ తేది వరకు కొనసాగుతుందని ఆవిన్ సంస్థ తెలిపింది.

రేపు ప్రైవేట్ జాబ్ మేళా

పెరంబూర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు జాబ్ మేళా ఈ నెల 27వ తేది శుక్రవారం జరుగనుంది. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... గిండి, ఆలందూర్ రోడ్డు సమీపంలో ఉన్న ఉద్యోగావకాశాల కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగనున్న ఈ శిబిరంలో, 8,10,12 తరగతులు ఉత్తీర్ణులైన వారు డిప్లొమో, డిగ్రీ, వృత్తి, సాంకేతిక విద్యా కోర్సులు పూర్తిచేసిన వారు పాల్గొనవచ్చు. వివరాలకు www.tnprivatejobs.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రవాణా సంస్థ తెలియజేసింది. ఈ నెల 27వ తేది శుక్రవారం, 28 శనివారం, 29 ఆదివారం మూడు రోజులు సెలవులు వస్తుండడంతో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. కిలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు ఈ నెల 27వ తేది 245, 28న 240 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు తదితర ప్రాంతాలకు 27,28 తేదీల్లో మొత్తం 81 ప్రత్యేక బస్సులు, మాధవరం టెర్మినల్ నుంచి 27,28 తేదీల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

మెరీనా 'ఫుట్ ఫెస్టివల్'లో రూ.1.50 కోట్ల విక్రయాలు

పెరంబూర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్‌లో నిర్వహించిన 'ఫుడ్ ఫెస్టివల్'లో సుమారు రూ.1.50 కోట్ల మేర వ్యాపారం జరిగింది. రాష్ట్ర నగర ప్రాంత జీవనాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో మహిళాస్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 24వ తేది వరకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు.రాష్ట్రంలోనిపలు జిల్లాల్లో పేరుగాంచిన మాంసాహార, శాఖాహార వంటలతో స్టాల్స్ ఏర్పాటయ్యాయి. ఈ ఫెస్ట్‌లో 45 స్టాల్స్ ఏర్పాటుచేసి, 286 రకాల వంటకాలు విక్రయించారు. ఐదు రోజులు జరిగిన ఈ ఫుడ్ ఫెస్టివల్‌ను 3.20 లక్షల మంది సందర్శించగా, రూ.1.50 కోట్ల మేర విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు.

పుదుకోటలో నిండుతున్న చెరువులు

● చేపలు పెంచుతున్న రైతులు



వాగులో చేప పిల్లలను విడిచిపెడుతున్న రైతులు - చేపపిల్లలను అమ్మకానికి సిద్ధం చేస్తున్న రైతు

టి.నగర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లాలో ఈశాన్యరుతుపవనాలు, ఫెంగల్ తుఫాన్ ప్రభావిత వర్షాలతో చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. అదే సమయంలో జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన రైతులంతా హఠాత్తుగా చేపల పెంపెకంపై ఆసక్తి పెంచుకున్నారు. జిల్లాలో నీటివనరుల శాఖ ఆధ్వర్యంలో 986 వాగులు, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 5 వేలకు పైగా చిన్న చెరువులున్నాయి. ప్రస్తుతం ఈ వాగులు, చెరువులు నిండి పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులంతా చేపల పెంపకం కోసం వాగులు, చెరువుల్లో చేపపిల్లలను విడిచిపెడుతున్నారు. ఈ విషయమై చేపలపెంపకంలో చేయితిరిగిన అరంతాంగికి చెందిన రైతు వి.రామనాథన్ మాట్లాడుతూ అరంతాంగిలో గత పదేళ్లుగా చెరువులు, చిన్నవాగులను వేలం ద్వారా లీజుకుతీసుకుని వాటిలో చేపలను పెంచుతున్నానని, తాను పెంచుతున్న చేపల పిల్లలను రైతులందరికీ విక్రయిస్తున్నట్లు తెలిపారు. వాగులు, వంకల్లో మూడు భాగాల్లో చేపలు పెంచడానికి అనువుగా సీసీ, రోగు, మిర్కాల్, కడలా, కొంద్దై వంటి రకాలకు చెందిన చేప పిల్లలు తమ వద్ద ఉన్నాయని, వీటిని చెరువులు, వాగులలో పెంచడం వల్ల అధిక లాభాలను ఆర్జించవచ్చునని ఆయన వివరించారు. భారతీయ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎస్ గణపతి మాట్లాడుతూ పుదుకోట జిల్లాలో 6003 చెరువులు, వాగులున్నాయని, ఇవన్నీ ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాలకు నిండుతాయని చెప్పారు. వీటిలో చేపలు పెంచడానికి పుదుకోట, తంజావూరు వంటి జిల్లాల్లోని ప్రైవేటు ఫామ్‌ల్లోనే చేప పిల్లలను కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. మత్స్య శాఖాధికారులు ఈ ప్రాంతాల్లోని చెరువులు, వాగుల్లో పెంచడానికి వీలున్న చేప పిల్లలను తక్కువ ధరకు అందిస్తే జిల్లా అంతా చేపల పెంపకం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ విషయమై మత్స్య శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. పంజరాజా మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో జల్లాలోని అరంతాంగి, తట్టామణపట్టి తదితర ప్రాంతాల్లో చేప పిల్లల ఫామ్‌ల్లో చెరువులు, వాగుల్లో త్వరగా పెరిగే వివిధ రకాల చేప పిల్లలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రైతులకు సరైన అవగాహన లేకపోవడం వల్లే ఇతర ప్రాంతాలకు వెళ్ళి చేప పిల్లలను కొనుగోలు చేస్తున్నారన్నారు. ఏది ఏమైనప్పటికి పుదుకోట రైతుల ప్రస్తుతం చేప పిల్లల పెంపకంపై ఆసక్తి కనబరచటం హర్షణీయమని ఆయన తెలిపారు.

పుళల్ జైలులో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ కేంద్ర కారాగారంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ కారాగారంలో 4,000 మందికి పైగా ఖైదీలున్నారు. ఈ క్రమంలో, శిక్షా విభాగంలో పాత కాగితాలు అట్టలుగా తయారుచేసే విభాగంలో బుధవారం ఉదయం దట్టమైన పొగలు చెలరేగాయి. గమనించిన జైలు సిబ్బంది వెంటనే రెడ్‌హిల్స్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపుచేశారు.

సమ్మె బాటలో రామేశ్వరం జాలర్లు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లను, స్వాధీనం చేసుకున్న పడవలను వెంటనే విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ రామేశ్వరం జాలర్లు బుధవరం సమ్మె చేపట్టారు. ఈ కారణంగా 700లకు పైగా పడవలు తీరంలోనే నిలిచిపోయాయి. రామనాథపురం జిల్లా రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నుంచి సోమవారం 386 ఫైబర్ పడవల్లో జాలర్లు చేపల వేటకు వెళ్లారు. పాక్ జలసంధి సమీపంలో మంగళవారం చేపలుపడుతున్న జాలర్లు 17 మందిని శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి, రెండు పడవలు స్వాధీనం చేసుకుంది. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచి జాఫ్నా జైలుకు తరలించారు. ఈ క్రమంలో, శ్రీలంక నావికాదళం చేస్తున్న అమానుషదాడులు ఆపాలని, శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలు సత్వరం విడిపించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ రామేశ్వరం జాలర్లు సమ్మె చేపట్టడంతో, రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది.

అమిత్ షా పర్యటన వాయిదా

పెరంబూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటన వాయిదాపడింది. కేంద్ర మంత్రి అమిత్ షా రెండు రోజుల పర్యటనగా శుక్రవారం నగరానికి రానున్నారని, రాష్ట్రంలో జరిగే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో, కేంద్ర మంత్రి అమిత్ షా పర్యటన వాయిదాపడినట్లు తెలిసింది. జనవరి మొదటి వారంలో అమిత్ షా రాష్ట్ర పర్యటన ఉండే అవకాశముందని బీజేపీ శ్రేణుల సమాచారం.

వాణిజ్య పన్నుల ద్వారా రూ.99,875 కోట్ల ఆదాయం

● మంత్రి మూర్తి

ప్యారీస్, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.99,875 కోట్ల ఆదాయం వచ్చిందని వాణిజ్య పన్నుల శాఖామంత్రి పీ.మూర్తి పేర్కొన్నారు. నందనంలోని వాణిజ్య పన్నుల శాఖా కార్యలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గత ఏడాది కంటే ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య పన్నుల శాఖ ద్వారా ఎక్కువ ఆదాయం వచ్చిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్ను రాబడిలో దేశం మొత్తంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. వాణిజ్య పన్నుల వసూళ్లలో ప్రత్యేక దృష్టి సారించిన ఆ శాఖా అధికారుల పనితీరును మంత్రి అభినందించారు. అనంతరం ఈ కార్యక్రమంలో తిరువారూర్ జిల్లాలో ఇటీవల మృతిచెందిన చిరు వ్యాపారులు సుశీల, కస్తూరి, విజయలక్ష్మీ కుటుంబాలకు చిరు వ్యాపారుల సంక్షేమ బోర్డ్ తరుపున ఒక్కొక్కరికి రూ.3 లక్షల చెక్కును మంత్రి అందజేశారు.

ఓటరు జాబితాలో సవరణలకు 23 లక్షల దరఖాస్తులు

పెరంబూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో సవరణలకు 23 లక్షల మంది దరఖాస్తు చేశారు. రాష్ట్రంలో అక్టోబరు 29వ తేది గణాంకాల ప్రకారం 6.27 కోట్ల మంది ఓటర్లున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, 2025 జనవరి 1వ తేది ఓటరు నమోదుకు అర్హతగా నిర్ణయించి, ఓటరు జాబితా సవరణ నవంబరు 28వ తేది వరకు చేపట్టారు. జాబితాలో పేరు తొలగింపునకు 2.69 లక్షల మంది, పేరు, చిరునామా మార్చేందుకు 1.60 లక్షల దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా సమర్పించారు. ఇక, కొత్తగా పేరు చేర్చాలని 9.22 లక్షలు, విదేశాల్లో ఉంటున్న 18 మంది, పేరు తొలగింపునకు 2.81 లక్షలు, పేరు, చిరునామా మార్పు తదితరాలకు 5.66 లక్షల మంది నేరుగా దరఖాస్తులు సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది.

14 నుంచి చెన్నై-భువనేశ్వర్ విమానసేవలు

పెరంబూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు జనవరి 14 నుంచి ఇండిగో సంస్థ విమాన సేవలు ప్రారంభించనుంది. ప్రస్తుతం నగరం నుంచి భువనేశ్వర్‌కు ఇండిగో, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలున్నాయి. ఇండిగో సంస్థ ప్రతిరోజు ఉదయం 6.10, సాయంత్రం 5.55 గంటలకు రెండు విమానాలు నడుపుతోంది. మూడవదిగా జనవరి 14 నుంచి చెన్నై నుంచి ఉదయం 8.30 గంటలకు బయల్దేరే విమానం 10.20 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. అలాగే, భువనేశ్వర్ నుంచి ఉదయం 11 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12.40 గంటలకు చెన్నై చేరుకుంటుందని ఆ సంస్థ తెలిపింది.

రాష్ట్రంలో పెంపుడు జంతువుల గణన

పెరంబూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 21వ పెంపుడు జీవుల గణన చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు 45 శాతం పూర్తికాగా, ఫిబ్రవరి నెలాఖరులోపు ముగించాలని అధికారులు నిర్ణయించారు. రాష్ట్రంలో ఐదేళ్లకు ఒకసారి పశువుల గణన చేపట్టి, దాని ఆధారంగా మేలో పశువులకు టీకాలు, మందులు సిద్ధం చేస్తుంటారు. పశువులను పెంచే రైతులు పేరు, చిరునామా, ఆధార్ కార్డు, మొబైల్ నెంబరు, విద్యార్హత తదితరాలతో పాటు తాము పెంచుతున్న జీవుల సంఖ్యను ఫిబ్రవరి నెలాఖరులోపు తెలియజేయాలని అధికారులు తెలిపారు.

తెలివి మనుషులకే కాదు..

● డ్రోన్ కెమెరాను గమనించి పొదల చాటుకు ఏనుగు



డ్రోన్ కెమెరాను గమనిస్తున్న ఏనుగు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా పందలూరు పరిసరాల్లో తేయాకు తోటల కార్మికులు నివసిస్తున్న ప్రాంతాల్లోని ఓ ఏనుగు ఇటీవల కాలంలో తరచూ ప్రవేశిస్తోంది. ప్రాణనష్టం జరుగకముందే ఏనుగును అడవుల్లోకి మళ్లించేలా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఏనుగుకు బుల్లెట్ అని పేరు పెట్టిన అటవీ సిబ్బంది, దాని సంచారాన్ని పర్యవేక్షించేందుకు డ్రోన్ కెమెరా వినియోగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఓ తోటలో ఏనుగు సంచరించడం డ్రోన్ కెమెరాలో నమోదైంది. అదే సమయంలో ఎత్తులో ఎగురుతున్న డ్రోన్‌ను పసిగట్టిన ఏనుగు పొదల చాటుకు వెళ్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి.

జీపీఎస్‌తో సంచరించిన 'డేగ'



జీపీఎస్, కెమెరాతో డేగ

పెరంబూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడలూరి జిల్లా బన్రూట్టి సమీపంలో జీపీఎస్, కెమెరాతో డేగ సంచారం కలకలం రేపింది. చిత్తిరైచావిడి గ్రామంలోని ఓ ఇంటిపై మంగళవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో 'బారు' రకానికి చెందిన అరుదైన డేగ కనిపించింది. దానిని గ్రామస్థులు పరిశీలించగా, కాలికి ప్లాస్టిక్ తాళ్లతో జీపీఎస్, వెనుక భాగంలో చిన్న సైజు కెమెరా ఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని, ఈ విషయాన్ని అటవీ శాఖకు తెలియజేశారు. మధ్యాహ్నం 2 గంటల వరకు ఆ ఇంటిపై కూర్చున్న డేగను పట్టుకొనేందుకు కొందరు యువకులు యత్నించగా అది అక్కడి నుంచి ఎగిరిపోయింది. అటవీ శాఖ సిబ్బంది సమయానికి వచ్చి ఉంటే డేగను పట్టుకొని ఉండేవారని గ్రామస్తులు తెలిపారు. ఈ వ్యవహారంపై పోలీసులు, అటవీ శాఖ అధికారులు విచారిస్తున్నారు.

తొలిసారిగా గ్రామానికి ప్రభుత్వ బస్సు

● హారతులతో స్వాగతం పలికిన గ్రామస్తులు



హారతులిస్తున్న గ్రామస్తులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా ఏనాదికోట గ్రామానికి తొలిసారిగా వచ్చిన ప్రభుత్వ బస్సుకు గ్రామస్తులు హారతులిస్తూ స్వాగతం పలికారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఈ గ్రామానికి బస్సులు వచ్చిన దాఖలాలు లేవు. అందువల్ల గ్రామస్తులు 5 కి.మీ దూరంలో ఉన్న పరమకుడి, పార్తిపనూరు వెళ్లి అక్కడి నుంచి బస్సుల్లో వెళుతుంటారు. ఈ నేపథ్యంలో, తమ గ్రామానికి బస్సు వసతి కల్పించాలని కోరుతూ గ్రామస్తులు పరమకుడి ఎమ్మెల్యే మురుగేశన్‌కు విజ్ఞప్తి చేశారు. వారి కోరిక మేరుక బుధవారం నుంచి ఏనాదికోట నుంచి పార్తిపనూరు మీదుగా పరమకుడికి బస్సు సేవలను ఎమ్మెల్యే ప్రారంభించారు. దీంతో, తొలిసారిగా గ్రామానికి వచ్చిన ప్రభుత్వ బస్సుకు గ్రామస్తులు హారతులతో స్వాగతం పలికారు.

చెన్నై - తిరువళ్లూరు రహదారి పనుల్లో కదలిక

అడయార్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చెన్నై - తిరువళ్లూరు ప్రాంతాల మధ్య జాతీయ రహదారి విస్తరణ పనుల్లో ఎట్టకేలకు పదేళ్ళ తర్వాత కదలిక వచ్చింది. నగర శివారు ప్రాంతాలైన అంబత్తూరు, పట్టాభిరాం, ఆవడి ప్రాంతాల మధ్య ఈ రహదారిని 80 అడుగుల్లో నిర్మించేలా డీపీఆర్ సిద్ధం చేశారు. చెన్నై - తిరుపతి ప్రాంతాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించడం, వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా నాలుగులేన్ల రహదారి నిర్మాణ పనులు పదేళ్ళ క్రితం ప్రారంభించారు. అయితే, 22 కిలోమీటర్ల మేరకు 120 అడుగుల వెడల్పుతో ఆరు లేన్ల రహదారిగా నిర్మించేలా ప్లాన్ చేశారు. అయితే, అంబత్తూరు, ఆవడి, పట్టాభిరాం ప్రాంతాల్లో రోడ్డు విస్తరణకు స్థల సేకరణ పెను సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఈ పనులు పదేళ్లుగా అటకెక్కాయి. ఇపుడు 120 అడుగుల రహదారిని 80 అడుగులకు కుదించి నిర్మించేలా డిజైన్‌లో మార్పులు చేశారు. దీంతో ఈ రహదారి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభంకానున్నాయి. ఈ రోడ్డు విస్తరణ పనులు రూ.152 కోట్లతో చేపట్టనున్నట్టు అధికారులు వెల్లడించారు.

రాష్ట్రంలో 56 శాతం పెరిగిన బాల్యవివాహాలు

● ఈరోడ్, తిరునల్వేలిలో అధికం



పెరంబూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు ఎన్ని అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. మూఢ నమ్మకాలకు, దురాశకు పోయి బాలికల బాల్యాన్ని ఛిద్రం చేసేస్తున్నారు. ఎదుటి వ్యక్తుల నుంచి వస్తున్న 'ఆశా'జనక మాటలు, తమ భారం తగ్గించుకుందామనే ఆలోచనతో చిన్నిపిల్లల్ని పెళ్లిపీటలెక్కిస్తున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఏకంగా 55.6 శాతం బాల్య వివాహాలు పెరగడమే ఇందుకు తార్కాణం. 2023లో 1,054 బాల్యవివాహాలు జరగ్గా, ఆ సంఖ్య ఈ ఏడాది నవంబరు నాటికి 1640కు పెరగడం పలువురిని ఆందోళనకు గురి చేస్తోంది.

ఫిర్యాదుల్లో జాప్యం...

బాల్యవివాహాలపై ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు అక్కడకు చేరుకొని వాటిని అడ్డుకోవడం సహజం. అయితే గత రెండేళ్లలో తగ్గినట్లు తెలిసింది. 2022లో 3,609 ఫిర్యాదులు అందగా, 70.2 శాతం వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. ఫిర్యాదులు రావడం ఆలస్యమవుతుండడంతో పూర్తిస్థాయిలో వీటిని అడ్డుకొనేందుకు అవకాశాలు లేకుండాపోయాయని సమాచారం. ఈరోడ్‌లో ఈ ఏడాది అధికంగా 150, తిరునల్వేలి జిల్లాలో 133 వివాహాలు జరిగాయి. అదే గత ఏడాది ఈ రెండు జిల్లాల్లో వరుసగా 62-40 చొప్పున వరుసగా బాల్యవివాహాలు నమోదు కాగా, ఈ ఏడాది రెండింతలు అధికమయ్యాయి. బాల్యవివాహాలు అధికంగా జరిగిన తొలి 10 జిల్లాల్లో 6 పశ్చిమ జిల్లాలున్నాయి. ఈరోడ్ మినహా కోవైలో 90, నామక్కల్‌లో 74, తిరుప్పూర్‌లో 66, ధర్మపురిలో 58, సేలం జిల్లాలో 51 బాల్యవివాహాలు జరిగాయి. తొలి పది జిల్లాల్లో నామక్కల్ జిల్లా ఉన్నా, 2022 నుంచి బాల్యవివాహాల సంఖ్య తగ్గుతుండడం గమనార్హం. 2024లో రాష్ట్రంలో నమోదైన బాల్యవివాహాల సంఖ్య 50 శాతానికి పైగా ఉంది. పెరంబలూరులో 94, దిండుగల్‌లో 77, తిరుపత్తూర్‌లో 66 చొప్పున తొలి పదిస్థానాల్లో నిలిచాయి. గత ఏడాదితో పోల్చితే, పెరంబలూరు, తిరుపత్తూర్, కోవై, ధర్మపురి, తిరుప్పూర్, నాగపట్టణం, అరియలూరు జిల్లాల్లో బాల్యవివాహాలు పెరిగాయి. అరియలూరులో రెండేళ్ల క్రితం రెండు బాల్య వివాహాలు మాత్రమే జరగ్గా, ఈ ఏడాది ఆ సంఖ్య 31కి చేరడం గమనార్హం.

కారణాలివే!

బాల్యవివాహాలకు ఆర్థిక వెనుకబాటు, జాతిపరమైన నిర్బంధాలు, అవగాహన లేకపోవడం తదితరాలు ప్రధాన కారణమని సామాజికవేత్తలు చెబుతున్నారు. పాఠశాల విద్య మధ్యలోనే ఆపేసే విధానాన్ని అడ్డుకొనేలా, బాలికలను ఉన్నత విద్యకు ప్రోత్సహిస్తూ 'పుదుమై పెన్' అనే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినా, బాల్యవివాహాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి వివాహాలతో బాలికలు పడే ఇబ్బంది, అనారోగ్యం తదితరాలపై మరింత అవగాహన కల్పించాల్సి ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అమరవీరుడికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



ఇన్బరాజ్ అంత్యక్రియల్లో సైనికాధికారులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అసోం రాష్ట్రంలో జరిగిన ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన సైనికులు మృతిచెందాడు. మదురై జిల్లా ఉసిలంపట్టి గ్రామానికి చెందిన ఇన్బరాజ్ అస్సోంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఇన్బరాజ్ సహా పలువురు సైనికులు ప్రయాణిస్తున్న వాహనం గుంతలో పడిన ఘటనలో ఇన్బరాజ్ మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు ఇన్బరాజ్‌కు ఏడు నెలల క్రితమే వివాహం కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

బ్యాంక్ ఖాతా అప్‌డేట్ అంటూ మెసేజ్ క్లిక్ చేస్తే రూ.7.5 లక్షలు హాంఫట్

పెరంబూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ నుంచి మెసేజ్ వచ్చిందని నమ్మి, వాట్సాప్‌లో వచ్చిన లింక్‌ను క్లిక్ చేసిన వెంటనే రూ.7.5 లక్షలు బదిలీ అయినట్టు మెసేజ్ రావడంతో బాధితుడు దిగ్భ్రాంతి చెందాడు. తిరుప్పూర్ జిల్లా రాయర్‌పాళయం ప్రాంతానికి చెందిన తంగరాజ్, అరుళ్‌పురంలో ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ నడుపుతున్నారు. ఇతనికి వీరపాండిలోని సిటీ యూనియన్ బ్యాంక్‌లో 13 ఏళ్లుగా ఖాతా ఉంది. ఈ నెల 8వ తేది తంగరాజ్ సెల్‌ఫోన్‌కు బ్యాంక్ లోగోతో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. అందులో, మీ బ్యాంక్ ఖాతా 'కేవైసీ' అప్‌డేట్ చేసేందుకు ఈ రోజు ఆఖరని, అప్‌డేట్ చేయని పక్షంలో మీ ఖాతా స్తంభించడం జరుగుతుందని మెసేజ్‌లో ఉంది. దీంతో, తంగరాజ్ మెసేజ్‌లో వచ్చిన లింక్‌ను క్లిక్ చేసి, అందులో తన పేరు, పుట్టిన తేది నమోదుచేశాడు. కొద్ది నిముషాల్లోనే అతని ఖాతా నుంచి రూ.7,42,800 బదిలీ అయినట్టు మెసేజ్ వచ్చింది. దీంతో ఖంగుతిన్న తంగరాజ్ అందజేసిన ఫిర్యాదుతో జిల్లా సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు.

బాలికకు గర్భం... మేనమామ అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాలికను గర్భవతిని చేసిన మేనమామను పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరు జిల్లా బన్రూటి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి (30), తన అక్క కుమార్తెతో చనువుగా ఉండేవాడు. గత జూన్‌లో బాలిక ఇంటికి వెళ్లిన ఆ వ్యక్తి ఆమెపై అత్యాచారం చేయడంతో ప్రస్తుతం బాలిక గర్భం దాల్చింది. దీంతో మేనమామ బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లి అబార్షన్ చేయాలని వైద్యులను కోరాడు. ఈ విషయాన్ని వైద్యులు బాలిక తల్లిదండ్రులు, బన్రూటి మహిళా పోలీసులకు సమాచారం అందించారు. ఈ వ్యవహారంపై బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసారు.

ధనుష్కోటి విషాదానికి 60ఏళ్లు

● మృతులకు నివాళి

ప్యారీస్, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా ధనుష్కోటిలో తుఫాన్ మిగిల్చిన విషాదానికి మంగళవారంతో 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మృతులకు నివాళులు అర్పించారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన ధనుష్కోటి నగరంలో 1964 డిసెంబర్ 24న సంభవించిన ప్రళయంలో నగరం తుడిచిపెట్టుకుపోయింది. జాలర్ల కుటుంబాలకు చెందిన పలువురు మృతిచెందారు. తుఫాన్ విళయతాండవానికి చర్చి, వినాయక ఆలయం, కస్టమ్స్, పోస్టాఫీస్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల భవనాలు ధ్వంసమై శిథిలాలుగా మిగిలాయి. వీటిని చూసేందుకు పర్యాటకులు, ధనుష్కోటికి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో విళయంలో మృతిచెందిన వారికి జాలరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, సముద్రంలో పూలు చల్లి, నివాళులు అర్పించారు.

భయభ్రాంతులకు గురిచేస్తూ బైక్ రేస్

● 48 ద్విచక్రవాహనాలు స్వాధీనం

పెరంబూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలైలో మంగళవారం అర్ధరాత్రి ప్రజలను భయభ్రాంతులు చేసేలా రేస్‌లు నిర్వహించిన ఘటనలో 48 కేసులు నమోదుచేసి 48 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి శాంతోమ్ సహా 350 ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ కమిషనర్ అరుణ్ ఉత్తర్వులతో 8,000 మంది పోలీసులు గస్తీ తిరిగారు. అలాగే, అర్ధరాత్రి బైక్ రేస్‌లు అడ్డుకొనేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో, అర్ధరాత్రి అన్నాసాలై, ట్రిప్లికేన్, చింతాద్రిపేట ప్రాంతాల్లో యువకులు బైక్ రేస్‌లకు పాల్పడ్డారు. మితిమీరిన శబ్దం, అతివేగంతో వెళ్తున్న బైక్‌లను చూసి ప్రార్థనలకు వెళ్లిన ప్రజలు, వాహనచోదకులు భయాందోళనలకు గురయ్యారు. వారిలో కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వగా, రోడ్డు మధ్యలో బారికేడ్లు ఏర్పాటుచేసిన పోలీసులు రేస్‌కు పాల్పడిన యువకులను అడ్డుకున్నారు. వారి నుంచి విలువైన 48 రేస్ బైక్‌లు స్వాధీనం చేసుకొని, యువకులపై కేసు నమోదుచేశారు.


తిరుచ్చి-కౌలాలంపూర్ విమానంలో సాంకేతికలోపం

పెరంబూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి నుంచి మలేసియా రాజధాని కౌలాలంపూర్ వెళ్లే విమానంలో సాంకేతికలోపం ఏర్పడింది. తిరుచ్చి విమానాశ్రయం నుంచి మంగళవారం అర్ధరాత్రి 12.10 గంటలకు 150 మంది ప్రయాణికులతో ఎయిర్ ఇండియా విమానం కౌలాలంపూర్ వెళ్లేందుకు సిద్ధంగా ఉంది. పైలెట్ పరిశీలనలో సాంకేతికలోపం గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు అక్కడకు వెళ్లి ప్రయాణికులను విమానాశ్రయంలో విశ్రాంతి గదులకు తరలించారు. నిపుణులు సాంకేతికలోపాన్ని పరిశీలించిన అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోయాయి. దీంతో, ప్రయాణికులను హోటళ్లకు తరలించిన అధికారులు, ఇతర ప్రాంతాల నుంచి పరికరాలు రప్పించారు. అనంతరం సాంకేతికలోపం సరిచేసి బుధవారం అర్ధరాత్రి విమానం కౌలాలంపూర్‌కు బయల్దేరుతుందని అధికారులు తెలుపడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ సస్పెన్షన్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో బస్సు నడిపిన డ్రైవర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. వేలూరు జిల్లా పేర్నాంబట్టు నుంచి మంగళవారం ప్రయాణికులతో ప్రభుత్వ బస్సు వేలూరు బయల్దేరింది. గుడియాత్తం కోటమిట్ట ప్రాంతానికి చెందిన బాబు (45) బస్సు డ్రైవర్‌గా వెళ్లాడు. బస్సు వేలూరు బస్టాండ్‌కు చేరుకోగా రవాణా శాఖ అధికారులు ప్రయాణికుల టిక్కెట్లు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో డ్రైవర్ బాబు మద్యం మత్తులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అదే సమయంలో వచ్చిన మార్గంలో బాబు బస్సును రాష్‌గా నడిపినట్లు ప్రయాణికులు అధికారులకు తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన అధికారులు నివేదికతో వేలూరు రీజియన్ ఎండీ నటరాజన్ డ్రైవర్ బాబును సస్పెండ్ చేశారు.

డిప్యూటీ సీఎం జన్మదినం సందర్భంగా అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న ఎంపీ జగద్రక్షకన్

తిరుత్తణి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినం సందర్భంగా వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అరక్కోణం ఎంపీ జగద్రక్షకన్, తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పాల్గొని, పార్టీ పతాకం ఎగురవేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి, న్యాయవాది సీజే శ్రీనివాసన్, పట్టణ కార్యదర్శి సీజే సెందిల్‌కుమార్, తిరుత్తణి శాసనసభ పరిశీలకులు ఎస్.షణ్ముగనాధన్, రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు ఓపి నాగలింగం, యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడు తిరుమలై లోకనాథన్, యూనియన్ లీగ్ ఎగ్జిక్యూటివ్‌లు ముత్తు, డి.చెంగయ్య, కె.ఆంజనేయన్, యూనియన్ కౌన్సిలర్ ఎస్కే శేఖర్ సహ పలువురు నేతలు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆకట్టుకుంటున్న పశువుల పాక సెట్టింగ్


క్రీస్తు జననంపై ఉపన్యసిస్తున్న బిషప్


ముచ్చటగొలుపుతున్న బాల యేసు

శాంథోంలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

రాష్ట్రవ్యాప్తంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

క్రిస్మస్ సంబరాలు రాష్ట్రంలో అంబరాన్నంటాయి. పండుగ వేళ దీపాలంకరణ, క్రిస్మస్ చెట్లు, స్టార్లు, శాంటాక్లాజ్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు, కేకులు కట్‌చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ క్రైస్తవులు సందడి చేశారు. పలు చర్చిల్లో పేదలకు సంక్షేమ సహాయాలు, అన్నదానాలు చేశారు. మంగళవారం అర్థరాత్రి నుంచి బుధవారం వరకు చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు ప్రజలు హాజరయ్యారు. కాగా ప్రార్థనా మందిరాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాష్ట్ర పోలీసులు నిఘా పెట్టారు.. అర్థరాత్రి ప్రార్థనల్లో క్రైస్తవులు పాల్గొనేందుకు వీలుగా ప్రభుత్వ రవాణా సంస్థలు ప్రత్యేక బస్సులు నడిపాయి.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి


భక్తులను ఆశీర్వదిస్తున్న ఫాదర్లు




ప్రార్థిస్తున్న భక్తులు




కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు - క్రిస్మస్ ప్రార్థనలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

తెలుగు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు


టీపీ సత్రం కల్వరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న రెవ. ప్రకాశ్‌రాజ్


సెంబియం జీసస్ మిరాకెల్ చర్చిలో...


కామరాజర్ నగర్ జీటీటీ చర్చిలో యూత్‌తో కలిసి పాటలు పాడుతున్న రెవ. దేవదాస్ పాత్ర


హాజరైన తెలుగు క్రైస్తవులు

ప్యారీస్, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో క్రిస్మస్ శోభ వెల్లివిరిసింది. తెలుగు చర్చిల్లో క్రీస్తు జననం గురించి చిన్నారులు నాటికలతో అలరించారు. కొయర్ బృందం పాటలతో బాల యేసుకు జేజేలు పలికారు. యేసు త్యాగాలను స్మరించుకునేందుకు మంగళవారం అర్థరాత్రి నుంచి బుధవారం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో చర్చిలు కిటకిటలాడాయి. నజరేతులో క్రీస్తు జననం పుడమికి పర్వదినమంటూ పాస్టర్లు ప్రసంగించారు.



పెరంబూర్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రసంగిస్తున్న రెవ. శరత్‌బాబు

టీపీ సత్రంలో...

టీపీ సత్రం తెలుగు లైన్‌లోని కల్వరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో సంఘ పెద్దలను సత్కరించారు. ఆసియా బాప్టిస్ట్ పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపకులు రెవ. డా. ఎస్.ప్రకాశ్‌రాజ్, మెర్సీ అండ్ ట్రూత్ స్త్రీల సహవాసం వ్యవస్థాపకురాలు దయానా రోజ్ పాల్గొని చిన్నారులు, యువతకు బహుమతులు అందజేశారు. అలాగే జ్యోతి అమ్మాల్ నగర్ తెలుగు బాప్టిస్ సంఘంలో క్రిస్మస్ గీతారాధన, క్యాండిల్ లైట్ సర్వీసులకు స్థానిక క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు.

జీసస్ మిరాకిల్ చర్చిలో...

పెరంబూర్ నియోజకవర్గం సెంబియంలో ఉన్న జీసస్ మిరాకిల్ చర్చిలో పాస్టర్ డి.శాంసన్ అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు జరిగాయి. సంఘ పెద్దలు, కార్యక్రమ ఏర్పాట్లు నిర్వహించి పేదలకు బిర్యానీ పంపిణీ చేశారు.

పెరంబూర్‌లో...

పెరంబూర్ కుక్స్ రోడ్డులో ఉన్న వాటర్ బరీ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సంఘ చీఫ్ పాస్టర్ రెవ. డా. పాల్ ఈశ్వరప్ప అధ్యక్షతన నిర్వహించిన క్రిస్మస్ దివ్యారాధనలో పుత్తూరుకు చెందిన క్రైస్ట్ షాలోం మినిస్ట్రీస్ దైవ సేవకులు డా. ఈ.శరత్‌బాబు సందేశమందించారు. సహాయ పాస్టర్లు రెవ. డి.ఆరోన్ దయాన్, రెవ. పీ.మదన్మోహన్, అధ్యక్షులు కె.ప్రకాశ్‌రావు, కార్యదర్శి ఆశిష్ అలెగ్జాండర్, ట్రెజరర్ గుంటి.కోర్నేల్, ఉపాధ్యక్షులు బీఎస్.జీవన్‌బాబు, ఉపకార్యదర్శి ఎర్రగుడ్ల జయకుమార్, స్టాండింగ్ కమిటీ, స్త్రీల సమాజం, యువజన, సండే స్కూల్, క్వయర్ విభాగాలకు చెందిన నిర్వాహకులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

అయినావరంలో...

అయినావరం రైల్వేక్వార్టర్స్ ప్రాంగణంలోని రక్షణ సైన్యం చర్చిలో క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. క్రాప్స్ కమాండింగ్ ఆఫీసర్లు లెఫ్టినెంట్ ఎం.విక్టర్ ఇమ్మానుయేలు, లెఫ్టినెంట్ ఎంపీఆర్ నివేదిత క్రీస్తు జనన విశేషాలపై పాట,ఆట, ప్రసంగాలతో అందరిని ఆకట్టుకున్నారు. కార్యదర్శి సూరిపోగు.థామస్, నిర్వాహకులు సాల్మన్, గొల్లపల్లి ప్రభుదాస్, పీ.పురుషోత్తం, సుమన్, సంజయ్, బేబి, ఆరోగ్య మేరీ సహా చిన్నారులు, తెలుగు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు.

మనలిలో...

ఉత్తర చెన్నై మనలి ప్రాంతంలోని ఈసీఐ తెలుగు చర్చిలో సంఘ కాపరి సురేష్ అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. రక్షణ సైన్యం లెఫ్టినెంట్ కల్నల్ ముద్ద అబ్రహాం లింకన్ ముఖ్య అతిథిగా హాజరై క్రీస్తు బోధనలు అనుసరనీయమని, నజరేతులో కీస్తు జననం పుడమికి పర్వదినమని కొనియాడారు.

కామరాజర్ నగర్‌లో...

కొరుక్కుపేట కామరాజర్ నగర్‌లో ఉన్న జీసస్ ట్రూత్ టబెర్నకెల్ చర్చిలో కాపరి రెవ. డా.దయాపాత్ర అధ్యక్షతన ఆనంద క్రిస్మస్ వేడుకలు ఉత్సహంగా సాగాయి. పండుగ సందర్భంగా సండే స్కూల్ చిన్నారులకు శారా దయాపాత్ర బహుమతులు అందజేశారు.

టి.నగర్‌లో...

టి.నగర్‌లో అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.సునీల్ అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫాదర్లు డేవిడ్, వివేక్‌లు విశ్వశాంతిని కాంక్షిస్తూ క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేడుకల్లో చిన్నారులకు సునీల్ బహుమతులు అందజేశారు. విశిష్ట అతిథులుగా డాక్టర్ ఉమర్ షరీఫ్, ప్రొఫెసర్ చంద్రబోస్, కార్యకర్తలు హరిబాబు పద్మనాభన్, జయరామన్, సూర్యకళ, తేన్‌మొళీ, కరాటే శేఖర్‌తదితరులు పాల్గొన్నారు.







మనలి ఈసీఐ తెలుగు చర్చిలో ప్రసంగిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ ముద్దా అబ్రహాం లింకన్ - అన్నాడీఎంకే క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులతో డాక్టర్ సునీల్ - అయినావరం రక్షణ సైన్యం చర్చిలో...

తిరుత్తణి హుండీ ఆదాయం రూ.1.24 కోట్లు



తిరుత్తణి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి వారి హుండీ ఆదాయం రూ.1.24 కోట్లు వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ ఆలయానికి ప్రతిరోజు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో, 28 రోజుల ఆలయ హుండీల లెక్కింపు ఆలయ జాయింట్ కమిషనర్ జానకి పర్యవేక్షణలో జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.1,24,15,185 నగదు, 402 గ్రాముల బంగారం, 8,345 గ్రాముల వెండి కానుకగా సమర్పించారు. లెక్కింపులో ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు సురేష్‌బాబు, నాగర్ సహా 100 మందికి పైగా ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొడైకెనాల్‌లో పెరిగిన పర్యాటకుల రద్దీ

చెన్నై, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో మంగళవారం పర్యాటకుల రద్దీ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం ఆ ప్రాంత మంతా ఉష్ణోగ్రత 5 డిగ్రీల సెల్షియస్‌కు తగ్గటంతో వాతావరణం బాగా చల్లబడింది. స్టార్ లేక్, బ్రయంట్ పార్క్, కీళ్‌భూమి తదితర ప్రాంతాల్లో మంచు కురుస్తోంది. మంగళవారం ఉదయం కొడైకెనాల్ లేక్ ప్రాంతం, జింఖానా, కీళ్‌భూమి, బ్రయంట్ పార్కు ప్రాంతాలు మంచుతో నిండి పర్యాటకులకు వెండి పరచుకున్నంత అనుభూతి కలిగిస్తోంది. ప్రస్తుతం విద్యార్థులకు సెలవులు కావడం, వరుసగా క్రిస్మస్, న్యూఇయర్ సెలవులు తోడవతుండటంతో కొడైకెనాల్‌కు మూడు రోజులుగా పర్యాటకు లు వవస్తున్నారు. స్టార్ లేక్ వద్ద మంచుకురుస్తున్నా లెక్కచేయకుండా ఆ సరస్సు నడుమ ఉన్న ఫౌంటెన్ తిలకిస్తూ పడవ సవారీ చేస్తున్నారు. ఇదే విధంగా ఆ లేక్ చుట్టూ హార్స్ రైడింగ్, సైకిల్ రైడింగ్ చేయడానికి పర్యాటకులు పోటీపడ్డారు.


సరస్సులో బోట్ సవారీ చేస్తున్న పర్యాటకులు

వైట్‌హౌస్ ఏఐ సీనియర్ పాలసీ అడ్వయిజర్‌గా ఎస్ఆర్ఎం వర్సిటీ పూర్వవిద్యార్థి

చెన్నై, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్టాన్‌కుళత్తూరులోని ఎస్‌ఆర్‌ఎం సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ పూర్వ విద్యార్థి శ్రీరామ్ కృష్ణన్ వైట్‌హౌస్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సీనియర్ పాలసీ అడ్వయిజర్‌గా నియమితులయ్యాడు. ఈ విషయాన్ని ఆ విద్యా సంస్థ వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్ ప్రకటించారు. శ్రీరామ్ తమ విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టిన సమయంలో అతడికి కంప్యూటర్లు, కంప్యూటర్ ప్రోగామింగ్ గురించి ఏమీ తెలియవని, ఆ తరువాత కంప్యూటర్ పరిజ్ఞానంపై ఆసక్తి కలిగి ఐటీ కోర్సు చదవి అత్యధిక ప్రావీణ్యత సంపాదించుకున్నాడని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో కృత్రిమమేథో పరిజ్ఞానంలో కీలకమైన వ్యక్తిగా ఎదగటం చూసి తామెంతో గర్వపడుతున్నామంటూ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ సి.ముత్తమిళ్‌సెల్వన్ పేర్కొన్నారు. అగ్రదేశం అమెరికాకు శ్రీరామ్ అందించనున్న సేవలు అతడి సాంకేతిక నైపుణ్యాన్ని విశ్వవ్యాప్తంగా ఎలుగెత్తి చాటనుందని ఆయన ప్రశంసించారు.


శ్రీరామ్‌కృష్ణన్


ట్రైలర్ రిలీజ్ లో థాను, కిచ్చా సుదీప్, కాట్రగడ్డ ప్రసాద్ తదితరులు

ఎస్.థానుకు శాండల్‌వుడ్ స్వాగతం

● కిచ్చా సుదీప్

చిత్రజ్యోతి

కోలీవుడ్ నిర్మాత కలైపులి ఎస్.థానుకు కన్నడ చిత్రపరిశ్రమ స్వాగతం పలుకుతుందని కన్నడ నటుడు కిచ్చా సుదీప్ పేర్కొన్నారు. వి క్రియేషన్స్ పతాకంపై సుదీప్ హీరోగా నిర్మాత ఎస్.థాను నిర్మించిన చిత్రం 'మాక్స్'. తమిళం, కన్నడ, మలయాళ, తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కించగా, ఈ నెల 27వ తేదీ విడుదలకానుంది. ఈ చిత్రం తమిళ వెర్షన్ ట్రైలర్ నగరంలో రిలీజ్ చేశారు. ఇందులో తమిళ సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్‌వీ ఉదయకుమార్, సినిమా దర్శకులు మిష్కిన్, రాజ్‌కుమార్ పెరియస్వామి, దేశింగ్ పెరియస్వామి, సౌత్ ఇండియన్ ఫిల్మ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ రవి కొటారక్కర, మాజీ అధ్యక్షుడు కాట్రగడ్డ ప్రసాద్, నటుడు ఇళవరసు, కొరియోగ్రాఫర్ షోబి తదితరులు పాల్గొన్నారు. నిర్మాత థాను మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం చిత్ర బృందం ఎంతగానో శ్రమించింది. పాటలను కంపోజ్ చేసిన యువ సంగీత దర్శకుడు అజనీష్ బి.లోకనాథ్ ప్రతిభ ప్రశంసనీయం' అని కొనియాడారు. హీరో కిచ్చా సుదీప్ మాట్లాడుతూ, 'దర్శకుడు విజయ్ కార్తీక్ ఆకారాన్ని చూసి తక్కువ అంచనా వేయొద్దు. మనిషి బక్కపలుచగా ఉన్నా ప్రతిభ పుష్కలం. కథ చెప్పిన తీరు అద్భుతం. ఒక మంచి కథ, సెంటిమెంట్‌తో కూడిన సినిమా. విజయ్ కార్తీక్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. కానీ, అతని అనుభవం చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. నన్ను ఓ శక్తిమంతమైన పాత్రలో చూపించిన తీరు అద్భుతం. తమిళంలో ఏ విధంగా అయితే, ట్రెండ్ సెట్ చేశారో అలాగే, కన్నడంలోనూ థాను ఓ ట్రెండ్ సెట్టర్‌గా మారాలని ఆకాంక్షిస్తున్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం ఇచ్చినందుకు నిర్మాతకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. కాగా, 'మాక్స్' మూవీలో కిచ్చా సుదీప్‌తో పాటు సునీల్, వరలక్ష్మి తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు.

తలకిందులుగా వర్కౌట్లు....

దుల్కర్ సల్మాన్ నటించిన 'సీతారామం' చిత్రం ద్వారా కోలీవుడ్‌లో మంచి గుర్తింపుతో పాటు పేరు సంపాదించుకున్న మృణాల్ ఠాకూర్.. తమిళంలోనే కాకుండా, తెలుగు, హిందీ భాషల్లో నటిస్తూ ఎంతో బిజీగా గడుపుతున్నారు. అదేసమయంలో ఆరోగ్యంపై కూడా ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. నిత్యం వ్యాయామం, వర్కౌట్లు చేస్తు శరీరాన్ని నాజూగ్గా ఉంచుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో ఆమె ఓ జిమ్‌లో తలకిందులుగా వర్కౌట్లు చేస్తూ కనిపించారు. ఈ వ్యాయామానికి సంబంధించిన వీడియో, ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసారు.. కాగా, మృణాల్ ఠాకూర్‌కు తమిళంలో ఒక్క అవకాశం కూడా లభించడం లేదు. ఇతర భాషల్లో నటించిన చిత్రాలు తమిళంలో విడుదల చేస్తున్నారు. అలా కోలీవుడ్ ప్రేక్షకులకు ఆమె చేరువయ్యారు.


మృణాల్ ఠాకూర్

చికాగోలో 'కమల్ 237' ప్రీ ప్రొడక్షన్ పనులు


కమల్ హాసన్‌తో అన్బరివు

స్టంట్ మాస్టర్స్ ద్వయం అన్బరివులు అగ్ర నటుడు కమల్ హాసన్ 237వ చిత్రానికి దర్శకత్వం చేయనున్నారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులు చికాగోలో జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాలో ఉన్న కమల్ హాసన్‌ను దర్శక ద్వయం కలుసుకుని, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై చర్చించింది. 'ఇండియన్-2' చిత్రం తర్వాత మణిరత్నం దర్శకత్వంలో 'థగ్‌లైఫ్' అనే చిత్రంలో కమల్ హాసన్ నటిస్తున్నారు. ఈ చిత్రం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఆర్టిఫిషియల్ టెక్నాలజీ(ఏఐ) పనులు రెండు నెలలుగా అమెరికాలో జరుగుతున్నాయి.వాటిని పూర్తి చేసుకుని ఆయన త్వరలో నగరానికి చేరుకోనున్నారు.ఆ తర్వాత తన 237వ చిత్రం పనులపై ఆయన దృష్టిసారించనున్నారు. ఇది పూర్తిస్థాయి యాక్షన్ భరితంగా తెరకెక్కనుంది. అన్బరివులు కూడా కొత్త ప్రాజెక్టులు ఏవీ అంగీకరించకుండా కేవలం కమల్ సినిమాపైనే దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో అమెరికాలోని చికాగోలో ఉన్న కమల్ హాసన్‌ను కలిసి ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా తమ అభిమాన హీరోతో దిగిన ఫొటోను వారు షేర్ చేశారు.

నిర్మాత నయనతార... హీరోగా విజయ్ సేతుపతి

అగ్రనటి నయనతార నిర్మాతగా ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఈ ప్రాజెక్టు కోసం చర్చలు సాగుతున్నాయి. ప్రముఖ దర్శకుడు హరి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్టు వినికిడి. హరి దర్శకత్వంలో విశాల్ నటించిన 'రత్నం' సినిమా ఆశించిన స్థాయిలో విజయం కాలేదు. ఈ నేపథ్యంలో తన తదుపరి చిత్రంపై ఆయన దృష్టి సారించగా, విజయ్ సేతుపతి నటించనున్నారు. దీంతో హరి - విజయ్ సేతుపతి కలిసి తొలిసారి పని చేయనున్నారు. ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే.. ఈ మూవీకి నయనతార నిర్మాత. తమ సొంత నిర్మాణ సంస్థ రౌడీ పిక్చర్స్ పతాకంపై నిర్మించనున్నారు. ఇప్పటివరకు చిన్న బడ్జెట్ చిత్రాలను నిర్మించిన నయనతార - విఘ్నేష్ శివన్ దంపతులు ఈ ప్రాజెక్టును మాత్రం భారీ బడ్జెట్‌తో తెరకెక్కించాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించిన అధికారపూర్వక ప్రకటన త్వరలోనే వెల్లడికానుంది.


నయనతార - విజయ్ సేతుపతి